కథానిక

# అర్థం అవుతూన్న జీవితం

శశిభూషణ్ పాత్రో

మంచి సినీమా, ఎలాగన్నా వెళ్ళితీరాలి, అనుకున్నాడు రవి. గాని డబ్బులేదు. ఇంతా చేస్తే ఒక రూపాయేకదా కావాలి. టికెట్ కోసం పదాణాలు, సైకిల్ కోసం అణా, ఆట ఆరంభం కాకముందు ఓ కప్పు టీ ఆరుకాన్లు, మధ్యాంతరంలో ఓ టీ ఆరుకాన్లు, మొత్తము మూడణాలు. ఈ రెండు టీల తర్వాత రెండు కిళ్ళీలు అణా, రెండు కెవెండర్ సిగరెట్లు అణా అయిపోయింది రూపాయి. "ఖేల్ ఖతమ్ పైసా హజమ్." ఎలా చావటం? ఆలోచించాడు రవి. ఊఁహూఁ! బుర్రలో ఉపాయంకోణం ఖాళీ అయిపోయింది.

సూర్యారావు దగ్గరకు వెళ్ళాడు. "ఏంరా?" అన్నాడు సూర్యారావు. "ఏమీలేదు... ఊరికే చూదిపోదామని..." నసిగాడు రవి. "అలా నసుగుతావేంరా? ఏదో మహత్కార్యం ఉన్నదన్న మాటే" అన్నాడు సూర్యం. "అంధియాఁ నీకు నచ్చిందేమిటి?" అన్నాడు రవి. హఠాత్తుగా వేసిన ప్రశ్నకు సూర్యం చకితుడయ్యాడు. "పిక్చరంతా ఎలావున్నా ప్లాట్ మంచిది గాబట్టి, ఒక్కసారి చూదినంత మాత్రాన నష్టం లేదనే చెప్పొచ్చు. మరి తమ రేమంటారు?" అన్నాడు సూర్యం.

"నేనింకా చూడలేదు. అసలు డబ్బుంటేగా" ధైర్యంగా అనేశాడు రవి. దీంతో సూర్యంతనని పిక్చర్ కి రమ్మంటాడేమోననుకొన్నాడు రవి. అదీకాకుండా ఓసారి సూర్యం చూసాడుగాబట్టి రెండోసారి వెళ్ళడేమోననుకున్నాడు. అయినా సూర్యం ఏం జవాబిస్తాడోనని యెదురుచూడసాగాడు పరీక్షా ఫలితాలు తెల్సుకోవాలనే ఉబలాటంతో నిరీక్షిస్తున్న విద్యార్థికిమల్లే. గుప్ చిప్ బీడీ దమ్ము లాగుతూ కూర్చున్నాడు సూర్యం. తను వాగింది సూర్యం విన్నాడోలేదో అని అనుమానించాడు రవి.

"ఏమిట్రా! అంతదీర్ఘంగాఆలోచిస్తున్నావు?" అన్నాడు రవి. "ఆలోచించటానికేముందిరా? ప్రస్తుతం నీకోరూపాయి కావాలి. ఏం? అంతేనా? ఇప్పుడు ఎవరిబుర్ర కొట్టాలాఅని ఆలోచిస్తున్నా నీమాట నేను వినలేదనుకున్నావేమో. నీభావాన్ని గ్రహించలేనంతటి మూర్ఖుణ్ణి కాను." అన్నాడు సూర్యం ఓ బీడీ అందిస్తూ.

బీడీ ముట్టించాడు రవి. గట్టిగా దమ్ములాగి ఆలోచించసాగాడు. జీతాలందుకున్న ఒకటి రెండురోజులవరకు తనదగ్గిర ఏదో కొద్దిగా డబ్బుంటుంది. తరవాత గోవిందా ఓ చిల్లికాని అన్నా వుండదు. అంతకుముందు తను గొప్పగా ఖర్చుచేసేవాడు. ఇప్పుడు అంతా ఖతమ్ ఐపోయింది. ఏమాత్రము అవకాశం దొరికినా, ఏమాత్రం పరిచయం ఏర్పడినా కిళ్ళీ దుఖాణాల్లో కాఫీహోటల్సులో అరువులు పెట్టేశాడు. "బిల్" ఎక్కువయింది. ఆ దార్లంట వెళ్ళటం మానేశాడు. ఛీ! వెధవ బ్రతుకు! ఎప్పుడన్నా ఏ వెధవాయన్నా ఏవార్లోనన్నా అకస్మాత్తుగా కనిపించి, తనను అడ్డగించి, నుంచున్న పళాన డబ్బు అడిగితేనో! అబ్బే ఇంకేమన్నావుందా. మర్యాదగా కాలం వెళ్ళబుచ్చుతున్న గుమస్తాగాడాయె. ఆ కాస్త పరువూ ఇట్టే ఊడిపోదూ?

తన ఖర్చుకోసం నాన్న "శాంక్షన్" చేసిన పదిరూపాయల్లోనుండి ఎంతో కష్టంమీద ఖర్చులు తగ్గించి అయిదు రూపాయలు మిగల్చగలుగుతున్నాడు. అలాగ మెల్లిగా ఆ పాత బాకీలు చెల్లించుకు వస్తున్నాడు. ఎన్నోసార్లు జీతాలు అందుకున్న తరవాత సూర్యాన్ని తను జబర్దస్తీగా సినీమాలకు తీసుకువెళ్ళేవాడు. కాని, ఒకనాడన్నా సూర్యం స్వయంగా తనను సినీమాకు రమ్మనలేదు పాత సంగతులు జ్ఞప్తికి రాగానే రవి కొంచెం ఫీల్ అవుతాడనే చెప్పాలి

అయినా, తనకు-సూర్యంకూడా ఆర్థికంగా ఎలా బాధపడుతున్నాడో. పెద్ద కుటుంబాన్ని సూర్యం ఒక్కడే పోషించాలి. సూర్యం కూడా

తనతోటి గుమాస్తాయే. అప్పుల ఒత్తిడివల్ల సూర్యం లోలోపల ఎంతగా కుమిలిపోతున్నాడో తనకు బాగా తెలుసు. ఈ కారణాలవల్ల సూర్యం కూడా చాలామట్టుకు సినిమాలు చూడ్డం మానుకున్నాడు. తనుకూడా అలాగే చేశాడుగా. తనుకూడా సినిమాలు చూడ్డం మానకపోతే దుకాణాల బాకీ తీర్చేగట్లా?

"సూర్యం నిన్నెంతగా ప్రేమిస్తున్నాడో నీకు తెలీదు రవి. అతనిది విశాల హృదయం. నవనీతంలాంటి మనసు. పూర్వజన్మలో నువ్వు అతనికి తమ్ముడివయి వుంటావేమోనని నాతో ఓసారి, అన్నాడు. ఏదన్నా మంచి పిక్చర్ వచ్చినప్పుడు డబ్బులేక నువ్వు బాధపడుతుంటావనీ, నిన్ను తీసుకువెళ్ళటానికి, తన అశక్తతను ప్రదర్శిస్తూ, సూర్యం బాధపడిన హృదయాన్ని నేను బాగా అర్థంచేసుకున్నా. నువు అతన్ని అన్యథా భావించకు. నువు అతని బోధపర్చుకోలేవు రవి!" అన్నాడు మణి. మణి ఇద్దరికీ స్నేహితుడే. ఇద్దరికన్నా వయస్సులో మణి పెద్ద. ప్రపంచానుభవాన్ని బాగా జీర్ణంచేసుకున్న వ్యక్తి

ఇవన్నీ జ్ఞాపకంరాగానే సిగ్గుపడ్డాడు. సినిమా సంగతియెత్తి సూర్యం మనస్సుని బాధపెట్టినందుకు పశ్చాత్తాపపడ్డాడు. "వెధవసినిమా! చూడకపోయినంతమాత్రాన చచ్చిపోతామా ఏమిటి! లేకపోతే లేదు" అనుకున్నాడు రవి. "సూర్యం, ఆ భావంతో నేను అనలేదు. నువ్వేమీ విచారించకు. నే వెళ్ళొస్తా. నీ మనస్సుని కలవరపరచినందుకు క్షమించు" అన్నాడు రవి.

"మరేం ఫరవాలేదు తమ్ముడూ. నువ్వు నన్నేం బాధపెట్టలేదులే. మన గుమస్తా జీవితాలు ఇంతేకదా అవి ఏడుస్తున్నా అంతే. మరేం కాదు. కాస్త టీ త్రాగి పోదువుగానిలే. కూర్చో" అన్నాడు సూర్యం.

సూర్యం మనస్సు ఎంతనిర్మలమైందీ, అనుకున్నాడు రవి. సినిమాల్లోనూ, కథల్లోనూ, నవలల్లోనూ, అతను విశాల హృదయాలు గల వ్యక్తుల్నీ, త్యాగంచేసే పాత్రల్నీ చూశాడుగాని, ఈ వేళ ప్రత్యక్షంగా అటువంటి మహనీయుణ్ణి చూడగానే రవి తల సిగ్గుతో, పశ్చాత్తాపంతో క్రిందికి దిగిపోయింది. టీ త్రాగాక ఇంటికి దారితీశాడు రవి. నెత్తినున్న పెద్దభారం దిగినట్టనిపించిందతనికి.

వెధవ సినిమా! ఎంతపని చేసిందీ! అనవసరంగా సూర్యాన్ని సందేహపు దృష్టితో చూశాడు. మరెప్పుడూ అతన్నలా అల్లరిపెట్టకూడదనుకున్నాడు. రాత్రి భోంచేశాక బయట వరండాలో కూర్చుని సిగరెట్ కాలుస్తున్నాడు రవి. డబ్బుంటే సినిమా చూస్తాడు; లేకపోతే లేదు. అంతేగాని, "చూడాలి" అని అనవసరంగా బాధపడకూడదనుకున్నాడు.

తను బాధపడ్డమే కాకుండా ఇతరుల్ని కూడా అల్లరి పెట్టడం ఏమంతన్యాయంగా వుంది! మజా మజాగా పెద్దపెద్దశేట్లు భోగభాగ్యాల ననుభవించినట్టుగా తనుకూడా అలా అనుభవించాలని తనకెన్నోసార్లు అటువంటి ఆలోచనలు కలిగాయి. ఓనాడు సూర్యంతో అననే అన్నాడు- "ఎవరన్నా ఓ శేట్ కూతుర్ని దొంగలాడి, ఆమె తండ్రికి 20 వేల రూపాయలు ఇవ్వండే అతని కూతుర్ని పంపించమని బెదిరిస్తూ ఓ ఉత్తరం రాస్తే?"

"వెంటనే చేతికి అరదడాలు పడతాయి. గుట్టుగా వస్తున్న వంశం తాలూకు పరువు మర్యాదలు ఇట్టే "స్వాహా" అవుతాయి. కాదూ అంటే ఆ సేట్ జీ తనకూతురు పుట్టినలగాయితూ ఇంతవరకు ఆమెకోసం అయినఖర్చు ఏమాత్రమో లెక్క కడతాడు ఇంకా ఆమె పెళ్ళికోసం కట్నాల్తోసహా ఎంతవుతుందో చూస్తాడు. ఆ తరవాత ఆమె పురిటిఖర్చులు వగైరాలు ఆమె చచ్చేవరకూ అంటే తను బ్రతికున్నంత వరకు ఏమాత్రం ఖర్చవుతుందో అదంతా అంచనావేసి డిమాండ్ చేసిన 20 వేలకు ఏమాత్రం హెచ్చు తగ్గులున్నా ఖాతరు చెయ్యకుండా 'చస్తేచచ్చింది' అని ఊరుకుంటాడు. తెలిసిందా?

"శేట్లు ఏదో భోగభాగ్యాల్ని అనుభవిస్తున్నారనుకుంటున్నవేమో! వాళ్ళుచేసిన ప్రతీపనీ, వేసిన ప్రతీఅడుగు వ్యాపారదృష్టితోనే. కాబట్టి ఈపిచ్చి వేషాలు, ఆలోచనల్లో పడబోకు. ఇంకా నీకు కుర్రతనం పోలేదు. నీ ఆలోచనలకు లోకం నిన్ను ఏవగించుకుంటుంది. అంతేగాని "కుర్ర వెధవ" అని ఉపేక్షాభావంతో ఊరుకోదు. అసలు నీకిటువంటి పాడుబుద్ధులెందుకు వస్తున్నాయో నాకు బోధపట్టంలేదు. ఇప్పుడు నీకు

కష్టమేమిటి? హాయిగా తలిదండ్రుల చాటున బ్రతుకుతున్నావాయె. నీకువచ్చిన లోటేమిటి?

"మరెప్పుడూ ఇటువంటి వెధవ ఆలోచనల్లో పడి బుర్ర పాడుచేసుకోవద్దు. ఉన్నదాంతోనే తృప్తిపడి జీవితం గడపటంలోనే గొప్పతనముంది. ఈ విధంగా నాతో ప్రస్తావించినందుకు నిన్ను నేను నీచంగా చూస్తున్నాననుకునేవుసుమీ! మళ్లీ అటువంటి అపోహల్తో నీ మనస్సుని కష్టపెట్టుకో వద్దు. ప్రపంచంలోని లోతుపాతులు నీకింకా తెలిసిరాలేదు గాబట్టి ఇంత చవగ్గా మాట్లాడుతున్నావు. నువ్వింకా కుర్రాడివి తమ్ముడూ కుర్రాడివి. నీకెంతన్నా పుణ్యముంటుంది. ఇహానుండి ఆ వెధవ చవకబారు డిటెక్టివ్ నవల్సు చదవకు. అవే నీ బుర్రను పాడుచేస్తున్నాయి." లెక్చరిచ్చేశాడు సూర్యం.

అతని మాటల్లో ఎంత సత్యంవుందో! ఆనాటి ప్రస్తావానికి తను ఎంతో నొచ్చుకున్నాడు. ఈ ఘటన జరగకముందు ఓసారి ఏవో తాయెత్తులు, తావీజుల సంగతి చెప్పాడు-"మనంకూడా ప్రొఫెసర్ అశోక్‌కిగాని, డాక్టర్ అజ్ మేరీకిగాని, లేక మెస్మెరిక్ హోమ్‌కి ఓ తావీజుకోసం రాస్తే బాగుంటుందేమో! దాని ప్రభావంవల్ల మనకు క్రాస్‌వర్డ్సులో ప్రథమ బహుమతి రాకూడదా!"

"నోరు మూసుకుని ఊరుకోరా. ఎందుకలా పిచ్చెత్తిపోతావు. వెధవది ఓ యాభయ్యో అరవయ్యో అప్పుందో లేదో మిరపకాయ తిన్న కాకికిమల్లే అరుస్తున్నావు.

"నువ్వు అన్నట్టుగా, తావీజులసంగతి నిజమో అబద్ధమో నాకు తెలీదుగాని, నిజంగా వాటిలో అంత ప్రభావముంటే, ఈనాడు ప్రపంచంలో ప్రతీవ్యక్తీ ధనికుడే పేదవాడు ఎవడూవుండడు. ప్రతీవాడూ క్రాస్‌వర్డ్‌లో ప్రథమబహుమతినందుకునేవాడే. వాళ్ళక్కూడా కిటుకులు తెలుసు. తీరా నువ్వు డబ్బు ఖర్చుపెట్టాక, వాటి ఫలితం ఏమీలేక తెల్లమొహం వెయ్యాల్సిందేగా.

"ఈ మధ్యనలాగే మెస్మెరిక్ హోంనుంచి ఓ మహానుభావుడు అయిదురూపాయల తావీజు తెప్పించాడు. అందులో ఒక జననమణీ, పుణ్యకుంకం, ఇంకేదో భస్మం ఉన్నాయి. ఏదో పరీక్ష ప్యాసవాలని తెప్పించాడు. పరీక్షతప్పాడు. అనవసరంగా అయిదురూపాయలు గోవిందా అయిపోయింది. నెత్తీనోరూ మోదుకుని మరీ ఊరుకున్నాడు. ఆ మెస్మెరిస్ట్ మహానుభావులకు ఈ విషయంలో ఉత్తరం రాస్తే ఎటువంటిజవాబు వస్తుందో అది అందరికీ తెలిసిందే గాబట్టి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపకుండా గుప్‌చుప్‌గా ఊరుకున్నాడు. ఇదీ తావీజుల మహాత్మ్యం.

"నువ్వు క్రాస్‌వర్డ్సుకి రెగ్యులర్‌గా ప్రయత్నించు. ఎప్పుడన్నా ఓసారి రాకపోతుందా! అనవసరంగా తావీజులగొడవలోపడకు" అన్నాడు సూర్యం.

"ఈ క్రాస్‌వర్డ్సులో నాకు నమ్మకంలేదు భాయ్." అన్నాడు రవి.

"అయితే ఊరుకో. ఎలాజరగనుందో అలాగే జరుగుతుంది" అన్నాడు సూర్యం.

సిగరెట్ చివ్వదైనందుకు వ్రేళ్లు చుర్రుమంది రవికి. పారేశాడు, అపుడే వెనకనుండి సూర్యం సర్వం వినిపించింది. "ఏమిట్రా అలా అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? కొంపతీసి ఇంకేదన్నా డబ్బుచేసే పద్ధతి కాదుకదా?" "చూశావా ఎప్పుడో బుద్ధిగడ్డితిని ఏదో అన్నందుకు ఇలా దెప్పుతున్నావు" అన్నాడు రవి యేడుపు మొహంతో.

"ఏడవకుతంబీ, ఏదో హాస్యానికి అన్నానులే. సరేగాని, అంధియాఁకి వెడదాంపద" అన్నాడు సూర్యం "రెండో ఆటకా? డబ్బు ఎక్కడిది? ఎవరిబుర్రకొట్టావు?" అన్నాడు రవి. "అదంతా నీకెందుకు? నువ్వు బయల్దేరవోయ్;" అన్నాడు సూర్యం. "అప్పుతెచ్చావా?" రవిప్రశ్న "అవును" అన్నాడు సూర్యం నవ్వుతో. "అయితే నేను రాను," రవి జవాబు. "అద్గదీ, అలావుండాలి. అయితే మాతమ్ముడు దార్లోకి వచ్చాడన్న మాట." సూర్యం సంతోషం. "అప్పుచేసి, సినీమాకి వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాను" రవిగారి భీష్మ ప్రతిజ్ఞ.

"అప్పుకాదులే. మీ వదినదగ్గిర నాలుగురూపాయలున్నాయి. మన సంభాషణ విన్నాక, సినిమాకు వెళ్ళమని రెండురూపాయలు తీసిచ్చింది;" అన్నాడు సూర్యం. ఇద్దరూ సరదాగా సినీమాకి లేచారు.